మొదటి భార్యను
అమానుషంగా చంపి
రెండో భార్యముందు
మనిషిగా
ఎలా మా[illegible]షు?

## రసరాజు కథ

# మచ్చ

కళ్ళు బైర్లు కమ్మాయి...

కాళ్ళు పట్టు తప్పాయి...

భూమి కంపించినట్లనిపించింది...

ఉప్పెన ఊరూవాడా ముంచేసినట్లనిపించింది....

బాధగా బయటకొచ్చాడు నారిగాడు.

పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు.

బండరాయి కంటపడింది.

"తల బద్దలు కొట్టుకుంటే..."

కొండ కొమ్ము కనిపించింది.

"ఎక్కి కిందికి దూకేస్తే..."

ఏవేవో ఆలోచనలు...

నారిగాడు నడుస్తున్నాడు...

అడుగులు తడబడుతున్నాయి.

దొరబాబు చెప్పిన మాట గుండెల్లో మరకత్తిలా దూసుకుపోయింది. "దొరబాబు సెప్పింది అబద్దమా... పచ్చినా కాదు... అచ్చరాలా అది పచ్చి నిజం.. అందుకే బండరాయో కొండ కొమ్మో పాపానికి అదే ఇరుగుడు..." నారిగాడు మనస్సు బాధతో ఊగిపోతోంది.

నారిగాడు నాగూర్ సెంటర్ దాటి మలుపు తిరిగాడు.

దూరంగా కొండ

మళ్ళీ యేదో మనస్సులో...

కళ్ళల్లో గోగులు

కంట తడి పెడుతూ గోగులు

దిక్కులేని దానిలా దిక్కు దిక్కుమంటూ గోగులు

మనస్సు మళ్ళించుకొన్నాడు...

మార్గం మార్చుకున్నాడు...

కాళ్ళు ఇంటి ముఖం పట్టాయి...



ఇంతలో వర్షం!...

గోగులమ్మ గుడ్డిదీపం వెల్తురులో నారిగాడి కోసం అదే పనిగా ఎదురు తెన్నులు చూస్తోంది.

నగరం నుంచి తెస్తానన్న బందరు మిఠాయి కోసం కాదు— ఆమె చూపు...

సరదాగా పట్టుకొస్తానన్న సన్నజాజులు కోసం కాదు— ఆమె నిరీక్షణ...

నాలుగ్గంటలకే వస్తానన్న నారిగాడు ఎనిమిది కొట్టినా ఇంకా ఇల్లు సేరుకోలేదు.

యెల్లింది అసలే పట్నం...

రోజూ అక్కడ పెమాదాలే...

యేం జరిగిందో యేమో—

ఏదీ ఆమె బాధ!

మావతోటే [illegible]....

మావతోటే మెతుకు.....

అన్నీ మావే!...

నారిగాడు పల్లెలో అడుగు పెట్టాడు.

కరణంవంతెన దాటాడు.

దానికెదురుగానే ఇల్లు

అప్పటిదాకా [illegible] నింపిన అప్పుడే పట్నం [illegible] బయలు పడ్డ సత్తిగాడు కనిపించాడు నారిగాడి వెనకే.

మావను చూడగానే గోగులమ్మ గుండెల్లో బరువు దిగినట్లనిపించింది.

"ఆలిస్సమయ్యిందే? ..." గోగులమ్మ అడిగింది.

నారిగాడిలో మాటామంతీ లేదు. సరాసరి లోనికెళ్ళిపోయాడు. మావ లో వచ్చిన మార్పు గొగులమ్మకు అంతుబట్టలేదు.

బందరు మిఠాయి లేదు—

సన్నజాజులు లేవు—

నిజానికవన్నీ తనకెందుకు—

మావ మనసు మంచిగా ఉంటే చాలు. అదే తనకు సొర్గం...

మావ వెనకాలే తనూ నడిచింది.

నారిగాడు గదిలోకెళ్ళి మంచంమీద వాలిపోయాడు.

గోగులమ్మ కూడా మావ ప్రక్కనే నులకమంచం మీద కూర్చుంది.

"మావా"

నారిగాడు పలకలేదు.

మళ్ళీ పిలిచింది. ఈసారి గోగులమ్మ గొంతు వణికింది.

నారిగాడు పైకిలేచి గూట్లో ఉన్న "నాటు" కొట్టేసి మళ్ళీ మంచం మీద వాలిపోయాడు.

గోగులమ్మకు మావ బాధేమిటో తెలీలేదు.

మావతో మనువాడి అప్పుడే మూడేళ్ళు.

ఈ మూడేళ్ళలోనూ మావ ఎప్పుడూ అలా కనిపించలేదు.

ఏదున్నా మనసులో ఎప్పుడూ దాచుకొనేవాడు కాదు.

అలాటిదీరోజు—

అదే ఆమె ఆలోచన!

గోగులమ్మకు నిద్రపట్టలేదు.

ఆ రాత్రి మెతుకుకూడా మింగలేదు.

ఒళ్ళంతా నిస్సత్తువుగా రక్తం తోడేసినట్లుగా ఏదోలా ఉంది. ఆ నిస్సత్తువలో గోగులమ్మకు అనుకోకుండా కళ్ళు మూత పడ్డాయి.

* * *

నారిగాడు మత్తులోంచి తేరుకొన్నాడు.

అప్పటికి రాత్రి రెండు గంటలు—

దొరబాబు చెప్పిన మాట పదే పదే గుర్తుకొస్తోంది.

అసలది తల్చుకొంటే చాలు అవయవాలన్నీ పట్టుతప్పి పోతున్నాయి.

"మందు" మింగుదామనుకొన్నాడు.

మళ్ళీ మింగకూడదనుకొన్నాడు.

ఎన్నిసార్లు మింగితే యేటి?

బాధ మల్లా మామూలే...

బతికినంత కాలం బరువు గుండెను మోయాల్సిందే. మచ్చకు తలొగ్గాల్సిందే!

ఈ 'మందు' మందు కాదు.

మరో మందుపడాలి దానితోటే పరిష్కారం...

అటూ ఇటూ చూశాడు...

అతనికేదో కనిపించింది.

అది వేలాడుతోన్న ఉట్టి...

గోగులమ్మ కేసి చూశాడు

నిద్ర...

మెల్లగా మంచం మీద నుంచి లేచాడు.

వెనగ్గదిలోకి నడిచాడు.

బల్ల.

తాడు

ఆ రెండూ చాలు...

అతనికి కావల్సినవి కూడా అవే ఆ క్షణంలో.

ఉరి సిద్ధమయింది.

ఆ ప్రయత్నంలో చిన్నచప్పుడు.

ఎంత జాగ్రత్త తీసుకొన్నా అది తప్పలేదు.

గోగులమ్మ కళ్ళు తెరిసింది. కంగారుగా—

మంచం మీద మావ లేదు.

కళ్ళు కూడ నులుముకోకుండా వెనగ్గదిలోకి హుటాహుటిన పరుగెత్తింది.

బల్ల—

తాడు—


మావ—

నారిగాడి ప్రయత్నం నీళ్ళు కారిపోయింది...

చప్పబడి పోయాడు...

అంతగానూ సిగ్గుపడిపోయాడు.

గుట్టుగా గుటుక్కుమందా మనకుంటే గోగులమ్మ అడ్డుపడి పోయింది.



"మావా" గోగులమ్మ శోకదేవతలా యేడ్చింది.

నారిగాడిలో ముద్దకట్టిన మౌనం.

గోగులమ్మలో గుండె తెగిన ఆవేదన

నారిగాడ్ని గోగులమ్మ తీసుకొచ్చి గదిలో మంచంమీద కూర్చోపెట్టింది.

* * *

"సిలకమ్మ" సిలకలాగే ఉండేది.

కట్టుకొవ్వోడి పేరే "దేవుడు" అనుకొనేది.

కోరికోరి మరీ పెళ్ళి చేసుకొందోమో గుండెల్లో ఆ దేవుణ్ణే నిలుపుకొంది.

పెళ్ళయిన అయిదేళ్ళవరకు బ్రతుకు మంచిగానే సాగిపోయింది. అందులో సందేహం లేదు. అయితే ఆ తర్వాత చరిత్ర మాత్రం అలా ఉండిపోలేదు. మరోలా మలుపు తిరిగింది.

సిలకమ్మకో అత్తగారు ఆ అత్తగారి అడుగుజాడల్లో అటూ ఇటూ బెసక్కుండా. అడుగులేసే మాంగారు అప్పటికి బ్రతికే ఉన్నారు. వాళ్ళిద్దర్నీ కాదని అడుగుముందుకేసే సాహసం నమ్మకొన్న దేవుడికి లేదు.

"మరో పెళ్ళి సేత్తే..." అత్తగారి మనసులో పురుగు పాకింది.

"అయిదేళ్ళగా అవుతా.... సూద్దాం" మనసులో మాట చెప్పాడు మాంగారు.

"ఇంకా సూట్టాలే... ఒక్కగానొక్కడు... ఆడికీ పిల్లపాప పుట్టకపోతే వంసెం నిలొద్దా...."

"అయితే..." నీళ్ళు నమిలాడు మాంగారు.

"అయితే లేదు... గియితే లేదు... అయిన పిల్లని సూచి ముడెట్టయ్యాలమే..."

"గొడవొచ్చేయ్యదూ..."

"అదినే సూసుకొంటాగా..."

సిలకమ్మ అన్ని మాటలూ ఆలకించింది.

ఆ రాత్రి చేతులెత్తి "దేవుణ్ణి" మొక్కుకుంది.

అన్యాయం సేయొద్దని యేడ్చింది.

ఆ రోజు మొదలు

సిలకమ్మ కాపురంలో నిప్పులురికాయి.

అత్తగారి ఆరడికి హద్దూ అదుపూ లేకుండాపోయింది. మాంగారి విసుర్లకి వేళా పాళా కనిపించకుండా పోయింది. "దేవుడు" పదేసరి దెయ్యంగా మారిపోయాడు.

వెర్రిబతుకు క్రమంగా సిలకమ్మను హేళన చేయసాగింది.

కడుపు పండితే చాలు కష్టాలు తీరిపోతాయి అనే నమ్మకం తనకు మాత్రం పూర్తిగా ఉంది.

కాని

కాలమే కలిసి రావటం లేదు.

నిట్టూర్చింది.

నింగికేసి సూసింది...

తన బ్రతుకు ఎంత మాత్రం సూన్యం కాకూడదనుకుంది.

అనాగరికంగా ఉన్న ఆ మారు మూల పల్లెలో తనకు సామభూతే కరువయ్యింది.

ఒంటి మీద దెబ్బపడని రోజు లేదు...

"గొడ్డుమోతుముండా..." అంటూ

తిట్టని క్షణం లేదు.

పిలకమ్మకు పుట్టిల్లు లేదు.

ఉంటే ఓదార్పు అందుకొనేదేమో...

కడుపు కింత కూడు పెట్టినా కాదని గొంతు నొక్కినా దేవుడే దిక్కు.

"దేవుడు" ఈ మధ్య పిలకమ్మను పూర్తిగా మర్చిపోయాడనే చెప్పాలి.

ఎవరి పక్క వాళ్ళదయి పోయింది.

నీతో సంబంధం తీరిపోయిందని ఖరాఖండీగా చెప్పేశాడు "దేవుడు".

విడిచి పెట్టేస్తానన్నాడు.

వేరే పెళ్ళి చేసుకొంటానన్నాడు.

గొడ్డుమోతుముండతో సంసారం చేయలేనన్నాడు.

పిలకమ్మకు ఏం చేయాలో బోధ పడలేదు.

దేవుడి కాళ్ళమీదపడింది.

బ్రతిమాలింది.

"దేవుడు" దయతలచలేదు. పరికదా రక్తం చిందేలా చావకొట్టాడు. ఓ రోజు రాత్రి—

అత్తగారు ఓ నిర్ణయానికొచ్చేసింది.

అమాటే చెప్పింది అటు కొడుక్కి ఇటు మొగుడికీ

"దానిపీడ వదిల్తేనేగాని వంసెం నిలవదు..."

అదే నిజమన్నాడు దేవుడు.

"అది బతికుండగా మరో పెళ్ళి కాదు.. పిల్లా జెల్లా కలగాలంటే అదొక్కటే మార్గం.."

మాంగారు తలూపేడు.

"నీకు దణ్ణం పెడతా మావా" పిలకమ్మా మళ్ళీ దేవుడి కాళ్ళ మీద పడిపోయింది. ఆ రాత్రి

మరేదో చెప్ప బోయింది.

మాట బయటకు రాలేదు.

గుండెల్లో గోదు గొంతు దాటి రావడం మానేసింది.

గుడ్డలు కుక్కిన గొంతు క్రమంగా ఉక్కిరి బిక్కిరవుతోంది.



మహిళామండలి

"ఏమండోయ్... మా మహిళామండలికి ఆ సుందరమ్మని అధ్యక్షురాలిగా ఎన్నుకున్నాం" అంది ఆండాళ్లు.

"ఎందుకని?" అడిగాడు కామేశం.

"ఆవిడ విరాళాలు బాగా సేకరిస్తుందట"

"అహో... అయితే చాలా పలుకుబడిగల ఆవిడన్నమాట."

"అదేంకాదు. ఆ సుందరమ్మ మొన్నమొన్నటివరకూ బిచ్చమెత్తుకు తిరిగేదట" చెప్పింది ఆండాళ్లు.

వి.అనంతపద్మనాభరావు (హైదరాబాద్)

కళ్ళు చూస్తున్నాయి కిరాతకాన్ని.

కన్నీళ్ళు కాల్వలై చెక్కిళ్ళను అదే పనిగా తడుపుతున్నాయి.

నమ్ముకొన్న దేవుడు నరరూప రాక్షసుడిలా ఎదురుగా అత్తగారు సాటి ఆడది అమానుషంగా—

కాలం చెల్లుతోన్న ముసలి మామ కాల కూట విషంలా...

మాట్లు నాలుగ్గోడలు నిర్జీవంగా చూస్తున్నాయి.

సిలకమ్మకు ఆ రాత్రే నూకలు చెల్లిపోయాయి.

*   *   *

నారిగాడు మంచం మీద కూర్చున్నాడు.

పక్కనే గోగులమ్మ.

అంతవరకు గుండెలవిసేలా యేడ్చిందేమో ఆమె కళ్ళు ఉబ్బి ఎర్రగా ఉన్నాయి.

నారిగాడు పరిస్థితి దయనీయంగా ఉంది.

అతని కళ్ళు గోగులమ్మ కేసి చూడటానికే సిగ్గుపడి పోతున్నాయి.

"తప్పు సేశానా మావా..."

నారిగాడు తలపైకెత్తేడు.

గొంతు విప్పలేదు...

మనస్సాగింది....

ఒక్కసారిగా గోగులమ్మను బలంగా కౌగిలించుకున్నాడు నారిగాడు.

యేడ్చాడు...

నారిగాడు తడిసిన కళ్ళను గోగులమ్మ పైటకొంగుతో పదే పదే తుడిచింది.

"తెలసి యే పాడుపనీ సెయ్యలేదు మావా... నన్ను నమ్ము మావా..."

"గోగులు..." ఆవేశంగా అరిచాడు నారిగాడు. నారిగాడు ఆ మాటల్ని భరించలేకపోయాడు.

అతని చుట్టూ మౌనం.

జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి బరువుగా అడిగింది మళ్ళీ ... "నా మీద అనుమానవా... సత్తిగాడు వానొచ్చిందని నిలబడ్డాడు... అంతదే మావా"

నారిగాడి నుంచి సమాధానం లేదు.

మౌనంగా పిచ్చిగా చూస్తున్నాడు.

"దొరబాబు దొరబాబు" గుండె అదే పనిగా పలవరిస్తోంది.

గోగులమ్మ పైకి లేచింది.

నారిగాడు తలపైకెత్తాడు మౌనంలోంచి విడివడి.

గోగులమ్మ వంటగదిలోకెళ్ళి కత్తి తీసికొచ్చింది.

"ఊ..." కత్తి అందించింది.

అమాయకంగానూ ప్రశార్థకంగానూ చూశాడు నారిగాడు.

"సాచ్చెమక్కర్లేదు... కట్టుకొన్న ఆడదానిమీద అనుమానం కలిగితే మరో సిచ్చలేదు. ఇదే..." కత్తిని మంచం మీద పెట్టింది.

నారిగాడు తట్టుకోలేకపోయాడు.

కత్తిని దూరంగా విసిరికొట్టాడు.

గోగులమ్మను ఒక్కసారిగా గుండెలకు అదుముకొన్నాడు.

"ఎందుకు బతికించావు నన్ను?..."

"అసలెందుకంత పని సేసేవూ?..."

ఎదురు ప్రశ్నవేసింది గోగులమ్మ.

'సెపితే నువ్వు భరించలేవే గోగులూ...''

''సెప్పు మావా... తలపటాయించకు...''

''పట్నంలో దొరబాబు...''

''మన కామందుగోరి దొరబాబేనా... పట్నంలో డాట్టరు గందా...''

''ఆయనే!....''

''ఆయన...''

''సెప్పేశాడు...''

''ఏవని?...''

''....''

''ఏం సెప్పాడు మావా....''

''పిల్లా పాపా నీకు పుట్టర్రా అని సెప్పేశాడు...''

గోగులమ్మ శిలలా నిలబడిపోయింది

మావతో మూడుముళ్ళూ పడి రేపు సంక్రాంతికి సరిగ్గా మూడేళ్ళు.

నేడోరేపో కడుపున కాయకాస్తుందన్న ఆశతో బ్రతుకుతున్న గోగులమ్మ నెత్తిమీద పిడుగుపడ్డట్లయింది.

మావకేసి చూసింది.

నారిగాడి కళ్ళల్లో కన్నీళ్ళు — సుళ్ళుసుళ్ళుగా...

గోగులమ్మ తమాయించుకుంది.

తన కన్నీళ్ళను తానేతుడుచుకుంది. ఆ చేత్తోటే నారిగాడి కళ్ళను కూడా తుడిచింది.

''దిగులెందుకు మావా... ఏ బిడ్డనో తెచ్చి పెంచుకొందాం...''


''గోగులూ...'' బాధగా అరిచాడు నారిగాడు.

ఆ ''బాధ'' — పిల్లా పాపా పుట్టరని కాదు.

తనను ''దేవుడి''గా నమ్ముకొన్న ముందు భార్య ''సిలకమ్మ'' తన సేతుల్లోనే అన్నేయంగా బలైపోయిందానాడు... ఎప్పటికీ అది మాసిపోని ''మచ్చ''గా తనను వెక్కిరిస్తూనే ఉంటుంది.

అదీ నారిగాడి బాధ!...

*



## కృత్రిమ గుండె

ఈనాడు ఎన్ని కొత్త వ్యాధులు ప్రబలుతున్నా... వైద్యరంగంలో కూడా అనేక సరికొత్త అద్భుత పరికరాలు పరిచయం అవుతూనే ఉన్నాయి. అలాంటి అత్యాధునిక పరికరమే కృత్రిమ గుండె వాషింగ్‌టన్‌కు చెందిన డాక్టర్ జాన్ మొకావియాక్ ఈ మధ్యనే 57 సంవత్సరాల రోగికి కృత్రిమ గుండె అమర్చి రెండువారాలు శ్వాస ఆడేలా చేశాడు.
ముఖ్యంగా గుండె దొరకని సందర్భాలలో గుండె మార్పిడి కోసం ఎదురచూస్తున్న రోగులకు కొన్ని నెలలపాటు ఈ కృత్రిమ గుండెను అమర్చవచ్చు. అలాగే గుండెకు శస్త్రచికిత్స. చేస్తున్న సమయంలో కూడా కృత్రిమ గుండెను ఉపయోగించుకోవచ్చునంటున్నాడు డాక్టర్ మొకాలియాక్? హాట్స్ ఆఫ్ టూ యూ డాక్టర్!

జూపిటర్